# కోపిష్ఠన చేపలు

ఎమ్.వి.వి. సత్యనారాయణ

జోషి వస్తున్నాడంటే బెదిరిపోతున్నాడు సారథి. జోషి ఇంటికి రానున్నట్టు చెప్పనే చెప్పింది సారథి భార్య. జోషి వస్తే అంతా వాడి సమస్యలే !

"మీరు ఇటు వెళ్ళారో లేదో అటు వచ్చారు మీ ఫ్రెండ్ జోషి. ఈ రోజు ఈదో ఒక సమయంలో మన ఇంటికి వస్తా నంటున్నారు !" అంది లలిత.

సారథి ఆమెవైపు నిట్టూరుస్తూ చూశాడు.

"టయిమ్ చెప్పాడా?" అడిగాడు సారథి.

"ఊహూఁ ! మీరు లేరని చెప్పేటప్పటికే వెనక్కి తిరిగాడు."

ఇక చేసేదేం వుంది? సారథి అతని రాకకోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు. వాకిట్లో ఏం అలికిడయినా సరే జోషి వచ్చినట్టుగా ఊహించుకునేవాడు. ఇంటి పనులు ఏవైనా చేసుకుందా మనుకున్నా మనసుమీద జోషి ప్రత్యక్షమయేవాడు. సారథికి మనసులో చికాకు పెరిగిపోయింది.

మధ్యాహ్నం మూడు గంటలకు వచ్చాడు జోషి. వస్తూనే సారథిని బయటికి తీసుకుపోయాడు.

"మనం ఎటయినా వెళ్దాం. నీతో చాలా చెప్పాలి. ఏదయినా పనిలో ఉన్నావా? బయల్దేరగలమా?" అడిగాడు జోషి.

లలిత ఇద్దరికీ టీ అందించింది.

టీ తాగి స్నేహితు లిద్దరూ బయటపడ్డారు. పార్కులో కూర్చున్నారు.

"ఇంట్లో పెద్ద గొడవైపోయింది !" అన్నాడు జోషి, ఉపోద్ఘాతంలాగా.

"ఎవరిమీద?" అడిగాడు సారథి నిరాసక్తంగా.

"ఇంకా ఎవరిమీద. నామీదే !"

"ఎందుకు? ఎవరు గొడవపెట్టారు?"

"మా మామగారు ! కట్నం సొమ్ము వాడేసుకున్నామని. నీకు తెలుసు కదా, మా మామగారు నాకు ఇరవై వేల రూపాయలు కట్నం ఇచ్చారు కదా. ఆ సొమ్మును మా చెల్లెలి పెళ్ళిలో ఖర్చు పెట్టేశాం ! ఈ సంగతి నీకు కూడా తెలుసు."

సారథి తల ఊపాడు. జోషి వాళ్ళ ఇంట్లో ఏం జరుగుతుందో అంతా సారథికి ఎప్పటికప్పుడు తెలుస్తూనే ఉంటుంది. తమ ఇంట్లో ఏం జరిగినా జోషి అంతా అతనికి పూస గుచ్చినట్టు చెప్తూ ఉంటాడు. రహస్యం దాచాడు.

"మొత్తం ఇరవై వేలూ ఖర్చు పెట్టేశారా?" అడిగాడు సారథి.

"ప్చ్. అయిదు వేల రూపాయలు ఆడంబరాలకోసం పెళ్ళిలో ఖర్చయిపోయింది. మిగతా పదిహేను వేలలో మూడు వేల రూపాయలు పురుళ్ళకి ఖర్చయిపోయాయి. వాళ్ళ అమ్మాయికే కదూ ఖర్చయాయి ! అయినా మా మామగారు ఆ ఖర్చు కూడా పనికిమాలిన ఖర్చుకింద కొట్టిపారేశారు. ఆ ఖర్చంతా నేను పెట్టుకోవలసింది మాత్రమే నని స్పష్టం చేశారు

"మీ ఆవి డేమంటుంది?"

"వాళ్ళ నాన్న పక్షం."

సారథి నిట్టూర్చాడు. అంతకంటే ఏం చేయగలడు ! జోషి విషయంలో అతడు అంతకంటే ముందుకు ఎలా వెళ్ళగలడు !

పార్కులోకి వేరుశెనగ లమ్ముకునేవాడు వచ్చాడు.

సారథి జంగిడీ దింపించి వేరుశెనగలు తీసుకున్నాడు. జోషి మెల్లగా గింజ లందుకున్నాడు. ఇద్దరూ నములుతూ చుట్టూ చూస్తున్నారు.

"మిగతా డబ్బు మి చెల్లెలి పెళ్ళిలో కట్నంగా ఇచ్చారన్న మాట !" అన్నాడు సారథి.

"అంతకంటే ఏం చేయమంటావు ! కుదరక కుదరక మా చెల్లెలికి సంబంధం కుదిరింది. వాళ్ళకు కట్నం డబ్బు అవసరంగా కావలసి వచ్చిందట. అక్కడికీ మా ఆవిడను అడిగే బాంకులోంచి డబ్బు తీశాను. వాళ్ళ నాన్నగారికి యథాలాపంగా రాసుకున్నట్టుంది. ఆయన ఆఘమేఘాలమీద పరుగెత్తుకు వచ్చారు."

"నీ కంటూ ఇచ్చిన కట్నంమీద వాళ్ళకు ఇంకా మమకారం ఉండకూడదు. అఫ్‌కోర్స్... మీ ఆవిడకు ఇంత ఆర్థిక సహాయం చేయాలని పేరు చెప్పి కట్నం ఇవ్వగల వాళ్ళు కాబట్టే కట్నం ఇచ్చి పంపించారు. మీకు ఇద్దరు పిల్లలు కూడా పుట్టారు. మీ జీవితం మీది. మీ ఖర్చు మీది. మీ మామగారి జోక్యం మీ కుటుంబ వ్యవహారాల్లో ఉండకూడదని చెప్పలేకపోయావా? నువ్వు మళ్ళీ ఆపాటి డబ్బును సంపాదించకపోతావా? సంపాదిస్తే మీ ఆవిడ చేతిలోనే పొస్తావ్ కదా !"

జోషి మొహంలోకి కొత్త ఉత్సాహం తిరిగి వచ్చింది. అతను సారథి నుండి ఆశించిన సమాధానం అదే అయి ఉంటుంది.

కొన్ని నిముషాల పాటు వెలిగిన అతని మొహం తిరిగి వాడిపోయింది.

"అసలు కట్నమంటూ తీసుకోకుండా ఉండవలసింది సారథి. ఆ డబ్బుకి ఆశపడిపోబట్టే కదా, ఆ తండ్రీ కూతుళ్ళ దృష్టిలో నేను చులక నయ్యాను."

సారథి ఈసారి సహజంగానే నిట్టూర్చాడు.

ఈ దేశంలో వైవాహిక వ్యవస్థ ఒక వికృత వ్యవస్థగా రూపుదిద్దుకుంది. కట్నం ఇస్తేనే కాని పెళ్ళి కాదు. ఇవ్వగలిగే వాళ్ళూ, ఇవ్వలేని వాళ్ళూ కట్నాల అంగడిలో పోటీలు పడి పెళ్ళికొడుకులను కొనుక్కుంటారు. పెళ్ళి గండం తప్పాక పెళ్ళి కూతురుకూ, ఆమె తరపువాళ్ళకూ ధైర్యమూ, ఉక్రోషమూ కట్టకలువుకుని తిరుగుబాటు ప్రబోధిస్తాయి.

పెళ్ళి నరక మవుతుంది. పనికిమాలిన డబ్బుది కర్రపెత్తన మవుతుంది. జీవితాలు క్షోభిస్తాయి.

జోషి కట్నం తీసుకోనకుండా పెళ్ళి చేసుకునుంటే బాగుండేది. ఇంత గొడవ అయేది కాదు. జోషి కట్నం తీసుకోకుండా పెళ్ళి చేసుకున్నంత మాత్రాన జోషి చెల్లెలికి మొగుడు ఉచితంగా దొరకడు గాక దొరకడు !

జోషి సంతృప్తి పడి సారథిని వదిలిపెట్టాడు. కేవలం ఇదంతా చర్చించుకోబట్టే జోషి అతన్ని ఇంటికి వెళ్ళనిచ్చాడు.

సారథికి ఇంట్లో సమస్యలు ఇంట్లో ఉన్నాయి. నెలాఖరు రోజులు కావడమే కాకుండా సారథి ఇంట్లో అందరికీ అస్వస్థతగా ఉంది. డబ్బుకోసం ప్రయత్నిస్తున్నాడు సారథి. ఎక్కడా సమకూడటం లేదు.

"ఏమండీ ! మన ఇంట్లో సమస్యలు లేవా, మీ స్నేహితుడి సమస్యలు తీర్చడానికి వెళ్ళారు. ఎక్కడైనా డబ్బు సమకూడిందా? పోనీ మందు లయినా అరువు సంపాదించలేకపోయారా?"



అంది లలిత.


సారథి జవాబిచ్చేలోగా ఇంటి వాకిట్లోకి ఒక ముసలాయన వచ్చాడు. అతన్ని చాలా సులువుగానే గుర్తుపట్టగలిగాడు సారథి.

జోషికి మామగారే అతను.

"బాబూ, సారథిగారూ ! మీరు మా ఇంటికి ఒకసారి రావాలి. ఏదైనా పనిలో ఉన్నారా బాబూ?" అన్నాడు ముసలాయన.

తన భర్తనూ, ముసలాయననూ మార్చి మార్చి చూసి విసురుగా కదిలి లలిత వంటింట్లోకి వెళ్ళిపోయింది.

సారథి ఎటూ కదలలేకపోయి చివరికి ముసలాయన వెంట బయల్దేరడానికే ప్రాధాన్య మిచ్చాడు. దారిలో ముసలాయన జోషి మాట్లాడిన విషయానికి అచ్చంగా వ్యతిరేకంగా మాట్లాడి బోర్ కొట్టించాడు.



"మా అమ్మాయి కిచ్చిన కట్నం సొమ్మును వాళ్ళ అమ్మాయికి ఎలా ఉపయోగించుకోగలరో చెప్పండి బాబూ, మా అమ్మాయి కట్నం సొమ్ము తిరిగి బాంకులో ఎప్పుడు వేస్తారో మీరైనా అడిగి పెట్టండి బాబూ, మీ మాటంటే మా అల్లుడిగారికి గురని మా అమ్మాయి చెప్పిందండి" అన్నాడు చివరగా.

సారథి గొప్ప ఇబ్బందిలో చిక్కుకుపోయాడు. కరవమంటే కప్పకు కోపం, విడమంటే పాముకు కోపం. మామా అల్లుళ్ళ మధ్యలో తల దూర్చి ఎవరికని ఎంతవరకూ చెప్పగలడు?

మధ్యవర్తిగా ఎటూ చెప్పలేనని మొత్తుకున్నాడు సారథి. తనను వాళ్ళ రగడలోకి ఈడ్చవద్దని ముసలాయనను బతిమాలుకున్నాడు. కాని ముసలాయన అతని చేతులు పుచ్చుకుని

బతిమిలాడి తను అల్లుడి ఇంటివరకూ తీసుకుపోవడంలో విజయం సాధించాడు.

జోషి మొహం దీనంగా ఉంది. సారథి అతని తరపునే మాట్లాడాడు. సారథిని దేశద్రోహిని చూసినట్టు చూశాడు జోషి మామగారు.

సారథి మాట్లాడుతున్నాడన్న మాటే కాని అతనికి ఇంట్లో సమస్యలే మస్తిష్కంలో తిరుగుతూండి కాన్సెన్ట్రేట్ చేయలేకపోతున్నాడు.

ముసలాయనకు సారథి వల్ల ఎంతమాత్రమూ ఉపయోగం కుదరకపోయేసరికి తగాదాను తాత్కాలికంగా విరమించుకున్నాడు.

సారథి తన ప్రయత్నాల మీద బయల్దేరాడు.

డబ్బూ కావాలి. మందులూ కావాలి. అందరికీ నెలాఖరే. నెలాఖరు కావడంతో ఎవరూ అతనికి సహకరించలేకపోయారు. నిరాశగా ఇంటికి తిరిగి వచ్చాడు సారథి.

జ్వరంగా ఉన్న ఇంట్లో వాళ్ళకు ఆ రాత్రికి కషాయం నీళ్ళే దిక్కయాయి.

రాత్రి తొమ్మిదవుతూనే జోషి, అతని భార్య రాధ ఇంటికి వచ్చారు. ఈసారి సారథి ఇంకా ఆశ్చర్యపోయాడు.

పిల్లలు ఇంట్లో నిద్రపోతుంటే వాకిట్లో చెట్టుకింద సారథి దంపతులూ, జోషి దంపతులూ సమావేశమయారు.

"చూడండి అన్నయ్యగారూ, నాకని మా నాన్నగారిచ్చిన కట్నం సొమ్ము మీ స్నేహితుడు ఉపయోగించుకుంటే ఇదేమైనా బాగుందండీ ! ఇరవై వేల రూపాయలండీ. ఒకటీ, రెండూ కాదండి, మీరైనా చెప్పం డన్నయ్యగారూ !" అంది రాధ.

సారథి చిరాకుపడి మనసులోనే కోపం అణుచుకున్నాడు.

ఏం చెబుతాడు? కట్నం ఇచ్చుకోకపోతే అప్పట్లో ఆమెకు జోషి మొగుడుగా దొరకడు. ఆమె జోషికే కాదు - ఎవడికైనా కట్నం చదివించుకుని చచ్చినట్టు సంసారం చేసి తీరవలసిన ఆడదే !

వరకట్నం సాంఘిక దురాచారం అనేది రెండో సంగతి.

ప్రస్తుతపు సంగతి వరకట్నం తీసుకున్న మొగుడు తన భార్యకు ఎప్పటికప్పుడు బాంక్ బాలన్స్ చూపలేని దుస్థితిలో ఉండటం !

"జోషి బాంక్ బాలన్స్‌లో ఇరవై వేలూ చూపిస్తే ఏం చేస్తావు?" అడిగాడు సారథి.

"ఎక్కడుంది అన్నయ్యగారూ - మూట వేయడానికి. నా కట్నం డబ్బు నా మొహాన కొడితే మా పుట్టింటికి పోతాను ! మా నాన్నగారికి నేను బరువు కాదు" అంది రాధ.

జోషి పట్టరాని కోపంతో అతలాకుతల మవుతున్నాడు.

నేను మాట్లాడబోతూంటే మా ఆవిడ కలగచేసుకుంది.

"వదినగారూ ! మాకు మా సమస్యలు లేవా మీ సమస్యలు వింటూ కూర్చోవడానికి? మీరు ఏమీ తోచక సమస్యను సృష్టించుకుని ఒడ్డున పడిన చేపలాగా కొట్టుకుంటున్నారు. కట్నం డబ్బు మీ మొహాన కొట్టేస్తే పుట్టింటికి పోతారు కదూ ! ముసలి తండ్రిని నమ్ముకుని మమ్మల్ని సముదాయించుకోలేక సతమతమైపోయే మీ అన్నయ్యగారిని ఒకసారి చూడండి. బుద్ధి లేకుండా అర్ధరాత్రి పూట బయల్దేరారు."

మిగతా ముగ్గురూ లలితవైపు చూశారు.

లలిత కోపావేశాలతో వణికిపోతోంది. వెన్నెల కూడా చెట్ల సందులలోంచి ఆమె మీదికి జాలువారడానికి సంకోచిస్తోంది.

సారథికి తన భార్య అంతగా కోపావేశాలకు గురికావడం ఎన్నడూ అనుభవం కాలేదు.

"నేను హిందూ స్త్రీని. నా మెడలో మంగళసూత్రం ఉందా?" అడిగింది లలిత.

జోషి, రాధ తెల్లబోయారు.

"వారం రోజు లయింది. అమ్మిపారేశాను. నా భర్త కంటే, నా పిల్లల కంటే నాకు మంగళసూత్రం ఎక్కువ కాదు ! భర్త బాధల్లో భర్త ఉంటే భార్యగా మరిన్ని సమస్యలు సృష్టించడానికి సిగ్గుగా లేదా? వెళ్ళండి వెళ్ళండి ! మా సంసారం, మా కష్టసుఖాలూ మాకు ఉండనే ఉంటాయి. ఉన్నాయి కూడా !" లేచింది లలిత.

స్థాణువులా నిలబడిపోయాడు సారథి.

వెన్నెల్లో జోషి దంపతులు ఆ వాకిట్లోంచి కదిలారు.

లలిత దూషించినందుకు సిగ్గుతో కాదు, అవమానంతో కాదు. సమస్యలు తమకే కాదు - ఎదుటి వారికీ ఉంటాయి అనే కొత్త తెలివిడితో.

అంతేకాదు ! తా మిద్దరూ సారథి కుటుంబానికి అన్ని సమస్యలు చెప్పుకున్నారు. రాధకు లలిత ఇప్పుడు తప్పితే ఎన్నడూ తన సమస్య ఇదీ అని చెప్పుకోలేదు. సారథి అయితే ఆమాత్రం కూడా చెప్పుకోలేదు. పిల్లలకు మాత్రలు కొనవలసిన డబ్బుతో పార్క్‌లో వేరుశనగపప్పు కొన్నాడు సారథి.

ఎందుకు? జోషిని బాధలోంచి తాత్కాలికంగా దారి మళ్ళించడానికి. అంతే ! ★

## ఐతిహాసిక మహా యుద్ధం

ప్రపంచ యుద్ధాల
ఘోర మారణహోమాల
తర్వాత జన్మించాను నేను !
ఒకే ఒక ఐతిహాసిక మహా యుద్ధం
కనులారా వీక్షించాలని
మహోన్మత్తుణ్ణి అవుతున్నాను !

ఇరవై ఒకటో శతాబ్దపు
మహామనిషిని నేనే నని
గర్వాతిశయంతో
విలయ నృత్యం చేస్తున్నాను !

ఒక చేతిలో శాంతి పావురాన్ని
మరో చేతిలో అణ్వస్త్రాల్ని
సంధిస్తున్నాను !
కోట్లాది మందికి అతి శీఘ్ర మృతి నిచ్చే
అత్యాధునిక మారణాయుధాలకై
అనంత పరిశోధనల్ని చేస్తున్నాను !

ఇరాక్‌లో ఇరాన్‌లో
శతఘ్ని కాల్పుల్లో మరణించి
రోడ్డు పక్క కుళ్ళుతున్న
నా శవం దృశ్యం నిరంతరం
నా హృదయంలో శతఘ్నుల్ని దట్టిస్తోంది !

నే చేసిన తప్పిదానికి
విశ్వమానవ జాతి అనుభవించనున్న
శిక్షకు ఇప్పుడు
భయ మహా వ్యాధి పీడితు ణ్ణవుతున్నాను !

శశికాంత్ శాతకర్ణి

